క్లుప్తంగా

మద్ది ఆంజనేయస్వామి సన్నిధిలో...



ఎస్పీ కుమార్‌కి ప్రసాదాలను అందజేస్తున్న ఈవో

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామివారిని ఏలూరు జిల్లా విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్, విశాఖపట్నం సీఐడీ డీఎస్పీ భాస్కరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు శేష వస్త్రంతో వారిని సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కింపు

లింగపాలెం : లింగపాలెం మండలంలో రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన రంగాపురం శ్రీభూనీళా సహిత శ్రీసత్యనారాయణస్వామి ఆలయ హుండీని సిబ్బంది గురువారం లెక్కించారు. 118 రోజులకు గాను స్వామివారికి రూ.2,79,596 ఆదాయం వచ్చినట్లు ఆలయ గుమస్తా గోపి విలేకర్లకు తెలిపారు.

టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డిని కలిసిన బీవీఎస్ రెడ్డి



లింగపాలెం : చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, లింగపాలెం గ్రామానికి చెందిన భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి(బీవీఎస్‌రెడ్డి) గురువారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషి, ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను బీవీఎస్ రెడ్డి వివరించారు. ఇటీవల లింగపాలెంలో పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఆత్మీయ విందు కార్యక్రమం నిర్వహించడంపై సుబ్బారెడ్డి అభినందించారు. పార్టీని గ్రామస్థాయిలో పటిష్టపర్చాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సుబ్బారెడ్డి బీవీఎస్ రెడ్డికి సూచించారు.

ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంచాలి

జంగారెడ్డిగూడెం : ల్యాండ్ సీలింగ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. గురువారం ప్రజాసంఘాల కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఉన్న రెండు లక్షల ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంచి పట్టాలు ఇవ్వాలని, పేదలకు భూమిని స్వాధీన పరచాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. జిల్లా కమిటీ సభ్యులు టీ.సత్యనారాయణ, ఆర్.డానియేలు, ఎస్.మహంకాళి, టీ.ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి కృషి

బుట్టాయగూడెం : దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం రమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద దివ్యాంగులకు మంజూరైన మూడు చక్రాల వాహనాలను వారితో పాటు వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మీ, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణల చేతుల మీదుగా పంపిణీ చేశారు. దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ పఠాన్ ముంతాజ్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ తెల్లం రమణ, ఏపీ గిరిజన కార్పొరేషన్ సభ్యులు తెల్లం చిన్నారావు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన


జంగారెడ్డిగూడెం : విద్యుత్ ఉద్యోగుల భవిష్యత్తుకు, వారి ప్రయోజనాలకు విఘాతం కలగకుండా త్రైపాక్షిక ఒప్పందాన్ని, గతంలో కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని విద్యుత్ ఉద్యోగులు కోరారు. జంగారెడ్డిగూడెంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద గురువారం విద్యుత్ ఉద్యోగులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐకాస నాయకులు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోళ్లు దొంగిలించాడన్న నెపంతో..

ద్వారకాతిరుమల : కోళ్లు దొంగిలించాడన్న నెపంతో వ్యక్తిపై దాడిచేసిన ఇద్దరిపై పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపురం గ్రామానికి చెందిన మురుగుల దుర్గారావు షెడ్డులోని కోళ్లు ఇటీవల మాయమయ్యాయి. వాటిని అదే గ్రామానికి చెందిన ముప్పిన సురేష్ దొంగిలించాడనే అనుమానంతో అప్పసాని ధర్మారావు, కొనకళ్ల అప్పారావు ఈనెల 25న రాత్రి కర్రలు, ప్లాస్టిక్ పైప్‌లతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎగువన తగ్గుతూ.. దిగువన పెరుగుతూ..

- ఉరకలేస్తున్న గోదావరి
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- పలుచోట్ల కోతకు గురవుతున్న రోడ్లు
- ముంపు బారిన పంటలు



పోలవరం రూరల్ : పట్టిసం శివక్షేత్రం వద్ద గోదావరి ఉరకలు



పోలవరం రూరల్ : జిల్లేళ్లగూడెం సమీపంలో కోతకు గురైన రోడ్డు



వేలేరుపాడు : ఎద్దెలవాగు ప్రాంతంలో బోట్‌పై ప్రజలను తరలిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉపనదుల నీరు, కొండవాగులనీరు కొంత తగ్గడంతో వరద ప్రవాహం క్రమేపీ తగ్గుతోంది. భద్రాచలం వద్ద నీటి మట్టం తగ్గుతున్నప్పటికీ దిగువన నదిలోకి శబరి నీరు కలవడంతో స్వల్పంగా వరద పోలవరం ప్రాంతంలో పెరుగుతోంది. ఎగువన తగ్గుతూ.. దిగువన పెరుగుతూ గోదారమ్మ ఉరకలేస్తోంది. గురువారం ఉదయం భద్రాచలం వద్ద 50.40 అడుగులకు చేరిన నీటిమట్టం తగ్గుతూ సాయంత్రానికి 47.80 అడుగులకు చేరింది. భద్రాచలం నుంచి దిగువకు 11,33,815 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. 2వ ప్రమాద హెచ్చరిక ఇంకా కొనసాగుతోంది. అయితే పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గురువారం ఉదయం నాటికి 32.910 మీటర్లు ఉన్న నీటిమట్టం స్వల్పంగా పెరుగుతూ సాయంత్రానికి 33.45 మీటర్లకు చేరింది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 11,81,299 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అయితే తగ్గుతూ పెరుగుతూ మరో రెండు రోజులు పాటు వరద ఇదే విధంగా ప్రవహించే అకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

కోతకు గురైన రోడ్డు మార్గం

కొండవాగుల ఉధృతికి పోలవరం మండలం జిల్లేళ్లగూడెం గ్రామ సమీపంలోని కుంకాల కాలువ ప్రవహించే రోడ్డు మార్గంలో కల్వర్టుకు రెండు వైపులా రోడ్డు మార్గం భారీగా కోతకు గురైంది. బుధవారం కురిసిన భారీ వర్షానికి కొండవాగులు పొంగి ప్రవహించాయి. మరలా కొండవాగులు పొంగి ప్రవహిస్తే మరింత కోతకు గురయ్యే పరిస్థితి ఉందని ఎంపీటీసీ మిడియం సింగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటం బాబూరావు తెలిపారు. అధికారులు కోతకు గురైన ప్రదేశాన్ని పరిశీలించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎర్రకాలువకు పోటెత్తిన వరద

జంగారెడ్డిగూడెం రూరల్ : భారీ వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలో వరద నీరు పోటెత్తుతోంది. గురువారం గంటకు 6,651 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరిందని ఇరిగేషన్ శాఖ ఏఈ భాస్కరరావు తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 80.45 మీటర్లు ఉన్నట్లు ఏఈ తెలిపారు. మరో 48 గంటలకు పాటు అధిక వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో డ్యాం అధికారులు అప్రమత్తమయ్యారు. ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగితే ఎర్రకాలువ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, నల్లజర్ల, నిడదవోలు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలోని పట్టెన్నపాలెంలో జల్లేరు వాగుపై నిర్మించిన తాత్కాలిక డైవర్షన్ రహదారికి కొట్టుకుపోయింది. రహదారి కొట్టుకుపోయి తూరలు బయటపడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రహదారి మీదుగా ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.

ముంపులోనే వరిచేలు

కొయ్యలగూడెం : ఎడతెరిపి లేని వానలు రైతన్నలను కంటతడిపాలు చేస్తున్నాయి. తుపాను ప్రభావంతో కొనసాగుతున్న వర్షాల వల్ల మండల వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వాగులు, కాలవలు వెంట ప్రవహిస్తున్న వరద నీరు సాగునీటి చెరువులను ముంచెత్తడంతో ఆయకట్టు పొలాలు జలదిగ్బంధనానికి గురి అయ్యాయి. ఇటీవల వరి ఊడ్పులు పూర్తయ్యాయని వరదల వల్ల యాభై ఎకరాలకి పైగా ముంపునకు గురై చెరువును తలపిస్తున్నాయని రామానుజపురం వేదాంతపురం గ్రామాల రైతులు పెదపూడి మోహనరావు, వంకాయల రామకృష్ణ, పొల్నాటి నరసయ్య, చిల్లర రామారావు, సింగంశెట్టి సత్యనారాయణ వాపోయారు. అంకాలగూడెం ముంపునకు గురి కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలను ప్రభుత్వ బీసీ హాస్టల్లో ఉంచి వసతి సదుపాయాలు అందిస్తున్నట్లు తహసీల్దార్ నాగమణి తెలిపారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు

పునరావాస కేంద్రాలలో ఉంటున్న బాధితులు కరెంట్ లేక ఇబ్బంది పడకుండా ఉండేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చి విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే ఇబ్బందిపడకుండా ముందస్తుగా జనరేటర్లను సిద్ధం చేశారు. దీంతో పాటు కమ్యూనికేషన్ వ్యవస్థ ఆగకుండా కుక్కునూరు బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద ఒక జనరేటర్‌ను, తహసీల్దార్ కార్యాలయం వద్ద మరో జనరేటర్‌ను ఏర్పాటు చేశారు.

మునిగిన పంటలు

కుక్కునూరు: గోదావరి వరద ఉధృతి మండలంలోని రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. గురువారం రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించిన వరదతో మండలంలోని పత్తి, మునగ, కూరగాయల, జామాయిల్ తోటలు నీటమునిగాయి. తొలకరిలో చల్లిన వరిపంట వరద ఉధృతికి కొట్టుకుపోయింది. గత ఏడాది ఇదే విధంగా రెండు, మూడు సార్లు పెట్టుబడి పెట్టి నష్టపోయిన రైతన్న మరల ఇప్పుడు వచ్చిన భారీ వరదతో తీవ్రంగా నష్టపోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వర్షాలు పడతాయన్న హెచ్చరికల నేపథ్యంలో ముంపు ఇప్పట్లో తప్పేలా లేదని రైతులు వాపోతున్నారు.

పునరావాస కేంద్రాల్లో భోజనాల ఏర్పాట్లు

గోదావరి వరద పెరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఐటీడీఏ పీఓ సత్యనారాయణ స్పష్టం చేశారు. కుక్కునూరు మండలంలోని రావికుంట ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం వరద బాధితులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఐటీడీఏ పీఓ సత్యనారాయణ మాట్లాడుతూ, గోదావరి రెండవ ప్రమాద హెచ్చరిక చేరడంతో వెంటనే మండలంలోని కొండిన్యముక్తి, ఆంబోతులగూడెం, లచ్చిగూడెం, కుక్కునూరు ఏ బ్లాక్‌లోని నిర్వాసితులకు అప్రమత్తం చేశామన్నారు. వారిని వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నామన్నారు. సీతారామనగరం గ్రామంలో ముంపు బారిన పడిన కుటుంబాలను పునరావాసకేంద్రాలకు తరలించామన్నారు. అంతేకాక సీతారామనగరం గ్రామస్తులకు బియ్యం పంపిణీ చేసినట్టు చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి రావికుంట పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. బాధితులకు చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాక పునరావాస కేంద్రాలలోని బాధితులు వ్యాధుల బారిన పడకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లించడంతో పాటు దోమల మందు పిచికారి చేశామన్నారు.



కుక్కునూరు : పునరావాస కేంద్రంలో భోజనాలు వడ్డిస్తున్న అధికారులు



వేలేరుపాడు : సామాన్లతో తరలివెళ్తున్న రేపాకగొమ్ము గ్రామస్తులు



కుక్కునూరు: కుక్కునూరులో నీటమునిగిన కూరగాయల తోట



కొయ్యలగూడెం : రామానుజపురం సమీపంలో ముంపు బారిన వరిచేలు



జంగారెడ్డిగూడెం రూరల్ : పట్టెన్నపాలెంలో జల్లేరు వాగుపై నిర్మించిన రహదారి కొట్టుకుపోయిన దృశ్యం



జంగారెడ్డిగూడెం రూరల్ : ఎర్రకాలువ జలాశయంలోకి పోటెత్తిన వరద నీరు

జగనన్న సురక్షతో నూరుశాతం ప్రభుత్వ సేవలు



లింగపాలెం : వేములపల్లిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా



కొయ్యలగూడెం : చొప్పరామన్నగూడెంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



జంగారెడ్డిగూడెం : ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా తదితరులు

లింగపాలెం : ప్రజలకు నూరుశాతం ప్రభుత్వ సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. గురువారం వేములపల్లిలో జగనన్న సురక్ష సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే పౌరసేవలు అందుతున్నాయన్నారు. 11 రకాల పౌరసేవలు ఉచితంగా పొందేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి సీఎం వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారని అన్నారు. గత టీడీపీ హయాంలో పథకాలు పొందాలంటే ప్రహసనంలా ఉండేదని, ఇప్పుడు అర్హుల చెంతకే చేరుతున్నాయని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అర్హులకు ఎమ్మెల్యే ఎలీజా వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, వైస్ ఎంపీపీలు మట్టా సురేష్,, కర్లపూడి ఝాన్సీ ఆనంద్, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ఏఎంసీ డైరెక్టర్ కె రామకృష్ణ, రావి కొండయ్య, మండల ప్రత్యేకాధికారి ఏవీఆర్ గంగాధరబాబు, అధికారులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ లబ్ధి

జంగారెడ్డిగూడెం : దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందజేస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. గురువారం స్థానిక 10వ సచివాలయం పరిధిలో గల 27, 28, 29 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కుల మతాల భేదాలు లేకుండా రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా జగనన్న కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఏ కారణం చేతనైనా ఇంకా కొందరు మిగిలి ఉంటారని భావించి వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తుంటే దానిని జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ డేటా చౌర్యం అనడం విడ్డూరంగా ఉందన్నారు. ముందుగా డేటా చౌర్యం అంటే ఏమిటో పవన్‌కళ్యాణ్ తెలుసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా, 10వ సచివాలయం పరిధిలో మొత్తం 2,565 ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. ఎంపీ కోటగిరి శ్రీధర్ నిధులు రూ.18 లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ఎలీజా తొలుత ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీ కన్వీనర్ బీవీఆర్ చౌదరి, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్ వందనపు సాయిబాల పద్మ, జిల్లా యూత్‌కమిటీ అధ్యక్షులు పడమటి గిరిబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం

కొయ్యలగూడెం : జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయ్యిందని ప్రజలు పేర్కొంటుండడం మనమంతా గర్వంగా భావించాలి అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. చొప్పరామన్నగూడెం పంచాయతీ పరిధిలో గురువారం ఎంపీటీసీ చిరువూరి కళావతి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దాదాపు నెల రోజులపాటు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కాగలిగాయని ప్రజలు అంటుండడంతో ప్రజా ప్రతినిధిగా అధికారులకు వారి తరుపున కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం నియోజకవర్గంలో ఈనెల 28వ తేదీతో ముగియనున్న జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులకు పిలుపు ఇచ్చారు. ఇళ్ల స్థలాలపై అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడం పట్ల ఆయన స్పందించారు. ప్రతిపక్ష పార్టీలు కోర్టులను ఆశ్రయించడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాకారం పూర్తిగా రూపు దాల్చలేదన్నారు. అప్పు తీసుకువచ్చి పేదల అభ్యున్నతికి, రాష్ట్ర పటిష్టతకు పాటుపడుతుండడం కూడా చంద్రబాబు చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. ప్రభుత్వం భూములను కొనుగోలు చేసి అయినా సొంత ఇంటి కల నెరవేరుస్తామని బాలరాజు వాగ్దానం చేశారు. తహసీల్దార్ పాసం నాగమణి, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, నాయకులు తగరం ఆశీర్వాదం, చిరువూరు శ్రీనివాస్, జి.సత్యనారాయణ, కూనపోము రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బోయగూడెంలో సురక్ష

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని బోయగూడెం సచివాలయం పరిధిలో మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనర్ ఎస్ రాంబాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో మొత్తం 328 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయాల పట్టణ కన్వీనర్ ఎస్ దుర్గారావు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు ఎ.సుబ్బారావు, మిరియాల దిలీప్, వెంపా కృష్ణ, జైపాల్, సచివాలయ కార్యదర్శి రాజా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చింతలపూడి : బోయగూడెంలో ధ్రువపత్రం అందజేస్తున్న నగర పంచాయతీ కమిషనర్

కలాం సేవలకు సలాం



కొయ్యలగూడెం : గవరవరంలో కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం : భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాంకి భారతజాతి సలాం పలుకుతోంది అని, ఆయన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. గురువారం గవరవరం గ్రామంలో మండల సచివాలయాల కోఆర్డినేటర్ నూకల రాము ఆధ్వర్యంలో నిర్వహించిన అబ్దుల్ కలాం 8వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సర్వమతాలను గౌరవించిన మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం అన్నారు. ఫోక్రాన్ అణు పరీక్షలతో ప్రపంచానికి భారతదేశ అణుపాటవాన్ని చాటి శత్రు దేశాల పాలిట సింహ స్వప్నంలా భారతదేశాన్ని మలిచారన్నారు. ఆయన చిత్రపటం వద్ద పూలమాలవేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ సీహెచ్ దుర్గాప్రసాద్, ఎంపీడీవో ఆర్.బీబీశ్రీలక్ష్మి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. అబ్దుల కలాం ఫౌండేషన్ చైర్మన్ యర్రా అప్పారావు ఆధ్వర్యంలో సభ్యులు అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి అబ్దుల్‌కలాం అందించిన సేవలను కొనియాడారు. అప్పారావు మాట్లాడుతూ అబ్దుల్ కలాం పేరున స్థాపించిన ఫౌండేషన్‌తో భవిష్యతులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్వరరావు, చాటపర్తి పోసిబాబు, రంగారావు, ఫణికుమార్, లోవరాజు, సునీల్, మెగా రామారావు, పి.సురేష్ పాల్గొన్నారు.

ప్రతి పథకం.. ఓ సువర్ణ అధ్యాయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న ప్రతి పథకం ఓ సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. గురువారం గంగవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థను ఆంధ్రప్రదేశ్‌లో చూసి నేర్చుకోవాలని పొరుగు రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడి ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయని, అదేవిధంగా వలంటీర్ల వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసి ప్రవేశపెట్టడానికి ప్రక్రియ ప్రారంభించింది అని బాలరాజు అన్నారు. అయితే ఉత్తర కుమారుడు లోకేష్ బాబు, దత్త కుమారుడు పవన్ కళ్యాణ్ లను కలుపుకొని చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై కుతంత్రాలు పన్నుతున్నారని గడపగడపకు తిరుగుతూ ప్రజల వద్ద పేర్కొన్నారు. మా ప్రభుత్వ పనితీరు నచ్చితేనే ఓటు వేయండి అని దమ్ముగా చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డిని మరొకమారు ప్రజలు ముఖ్యమంత్రిగా ఆశీర్వదించడం ఖాయమన్నారు. గంగవరం ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు అయితే మరింత అభివృద్ధి సాధిస్తుందని అందుకు తగిన విధంగా ప్రక్రియను ఇప్పటినుంచే ప్రారంభించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణుకు సూచించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, మద్దిపాటి సోమేశ్వరరావు పూసా దామోదరం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



కె గోకవరంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లింగపాలెం మండలం కె గోకవరం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులందరికీ నేరుగా అందజేస్తున్నామన్నారు. చిట్టచివరి లబ్ధిదారుడి వరకూ సంక్షేమ ఫలాలను అందిస్తున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం అవినీతి రహితమైన పారదర్శక పాలన అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకున్నా.. దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను ఇక్కడ అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందని ఎమ్మెల్యే ఎలీజా పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.గోకవరం సర్పంచ్ యలమంచి శ్రీనివాసరావు, పాశ్చానగరం సర్పంచ్ టి.మోహనరావు, ఎంపీటీసీ సీహెచ్ శివాజీ, మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పులపాటి వరప్రసాద్, సచివాలయ కన్వీనర్ మండలపు నరసింహారావు, గ్రామ మాజీ సర్పంచ్ మండలపు వీరభద్రరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.